ఠారెత్తిస్తున్న కుక్కలు

- రాత్రి వేళల్లో అరుపులతో హడలెత్తిస్తున్న వైనం
- ఒంటరిగా బయటకు రావాలంటే బెంబేలెత్తుతున్న కాలనీవాసులు
- నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్



22వ వార్డులో గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు

మద్దిలపాలెం : గ్రామ సింహాలు చీకటి పడగానే గర్జిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. హోరు మంటూ అరుస్తూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాలనీలోకి చేరి గుంపులుగా అరుచుకుంటూ కొట్లాడుకుంటున్నాయి. ఆ సమయంలో బయటకు రావడానికి ఎవరూ ధైర్యం చేయలేకపోతున్నారు. జీవీఎంసీ 22, 23వ వార్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాలనీల్లోని వీధుల్లో రోడ్లకు అడ్డంగా పడుకుని ఆ దారి వెంబడి వచ్చే వాహనాల వెనుక అరుచుకుంటూ పరుగులు తీస్తున్నాయి. అదే సమయంలో ఒంటరిగా వచ్చే వ్యక్తులను వెంబడిస్తున్నాయి. దీంతో కాలనీలో ఒంటరిగా బయటకు రావాలంటేనే స్థానికులు భయపడిపోతున్నారు. గ్రామ సింహాల స్వైర విహారం అధికమైందని, విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలపై మూకుమ్మడిగా దాడికి పాల్పడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

నియంత్రణ చర్యలు శూన్యం

జీవీఎంసీ 22వ వార్డు పరిధి పీతలవానిపాలెం, శివాజీపాలెం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో కుక్కలు గుంపుగా తిరుగుతున్నాయి. అర్ధరాత్రి సమయంలో అందరూ గాఢ నిద్రలో ఉంటే ఒక్కసారిగా అరుపులతో హడలెత్తిస్తున్నాయి. వాటిని అదుపు చేయడానికి బయట రావాలంటే అందరూ భయపడుతున్నారు. నైట్ డ్యూటీ చేసుకుని వచ్చే వారంతా కుక్కల బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడించడంతో వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వీధి కుక్కల నియంత్రణపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. వాటిని గుర్తించి డాగ్ క్యాచర్స్ ద్వారా ఆధీనంలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న శునకాలకు పశు సంవర్ధక శాఖ సిబ్బందితో సంక్షేమ శస్త్ర చికిత్సలు చేసి నగరానికి దూరంగా రేబిస్ వ్యాక్సిన్లు వేయించి వదిలి పెట్టాలని కోరుతున్నారు. ఇదంతా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నాం

మా వీధిలో కుక్కలు గుంపుగా తిరుగుతున్నాయి. ఇళ్లకు వెళ్లే మార్గ మధ్యలో తిష్టవేస్తున్నాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా కరిచేస్తాయని భయపడుతున్నాం. అర్ధరాత్రి వేళల్లో అరుపులతో హడలెత్తిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు బయటకు వెళ్లినా గుంపులుగా తిరుగుతూ భయపిస్తున్నాయి. జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి

– వంశీధర్, లక్ష్మీనగర్ కాలనీ, 22వ వార్డు

వాహనాలను వెంబడిస్తున్నాయి

ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటే వెనుక పరుగులు పెడుతూ వాహనదారులను కుక్కలు వెంబడిస్తున్నాయి. ఎక్కడ కుక్క కాటుకు గురి కావాల్సి వస్తుందోనని భయంతో వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నాం. వీధిలో కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలి. శునకాల నియంత్రణకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దినకర్, శివాజీపాలెం

ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణం



ఆటోలో పిక్నిక్‌కు వెళ్తూ వెనుక సీటులో ప్రమాదకరంగా కూర్చున్న బాలురు



పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మొరాయించడంతో తెన్నేటి పార్కు వద్ద తోస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ఆరిలోవ : పిక్నిక్‌ల సందడితో కొందరు పరిమితికి మించి ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. కార్తీక మాసం కావడంతో కుటుంబాలతో కలిసి ఆటోలు, బస్‌లలో చాలా మంది పర్యాటక ప్రాంతాలకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో ఒకటి, రెండు కుటుంబాల వారు ఒకే ఆటోలో కిక్కిరిసి ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఆదివారం బీచ్‌రోడ్డులో తెన్నేటి పార్కు వద్ద పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో ఓ ఆటో మొరాయించింది. ఆ ఆటో ముందుకు కదలక పోవడంతో సెక్యూరిటీ సిబ్బంది అతి కష్టం మీద వెనుక నుంచి నెడుతూ ముందుకు పంపించాల్సి వచ్చింది. ఆటోలో కూర్చున్న వారి సంఖ్య ఎక్కువ కావడంతోపాటు మరో నలుగురు బాలురు వెనుక సీటులో ఇరుక్కుపోతూ ప్రమాదకరంగా కూర్చొన్నారు. ఇలాంటి ప్రయాణాల వల్ల ప్రమాదాలు జరుగుతాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. సరదా కోసం పిక్నిక్‌లకు వెళ్లే వారు సౌలభ్యంగా ప్రయాణిస్తే మంచిదని అంటున్నారు.

యువ భారత్ సభ్యుల ఆత్మీయ కలయిక



ముడసర్లోవ పార్కులో యువభారత్ ఆత్మీయ కలయికలో మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ : ముడసర్లోవ పార్కులో ఆదివారం యువభారత్ సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు ఆత్మీయ కలయిక పేరుతో వనభోజనాలు నిర్వహించారు. సుమారు 250 మంది సభ్యులు పాల్గొని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సంస్థ నిర్వాహకులను అభినందించారు. యువ భారత్ సంస్థ ద్వారా ప్రతిభ కనబరిచిన బ్యాంక్ ఆఫీసర్ తండ్రి గ్యాస్ బాయ్ శ్రీను, ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి తండ్రి ఆటో డ్రైవర్ రాజును మేయర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువ భారత్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జి.ఎల్లాజీ, కామేశ్వరరావు, శ్రీను, మధు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



అలంకరణలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాలు

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం, పీల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గౌరీ పరమేశ్వరి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజుతోపాటు ఇతర గ్రామస్థులు, మహిళలు పాల్గొని గౌరీ పరమేశ్వరులను తలపై మోస్తూ వీధుల్లో ఊరేగించారు. అనంతరం సముద్రంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులతో పాటు, పీల వారి కుటుంబీకులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

26న రన్ ఫర్ అంబేడ్కర్



పోస్టర్లతో అసోసియేషన్ నాయకులు

విశాఖ విద్య : నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ అలుమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో నిర్వహిస్తున్న రన్ ఫర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సొసైటీ అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్ కోరారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం వర్సిటీ జియోగ్రఫీ విభాగం వద్ద ఆవిష్కరించారు. వర్సిటీ సీడీసీ డీన్ ఆచార్య టీవీ కృష్ణ, వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ శ్రీను

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీను హెచ్చరించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలు, సంతకాలు సేకరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి షాపుల వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల రోజువారీ కార్యకలాపాలపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

30న గ్యార్వీ షరీఫ్ ఉత్సవం

మహారాణిపేట : రామా టాకీస్ సమీపంలో ఉన్న యాసీన్ మసీద్ ఆధ్వర్యంలో దారుల్ ఉలూమ్ హాబిబుల్లా రజా–ఎ–ముస్తఫా మదర్సా సమక్షంలో అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 30న గ్యార్వీ షరీఫ్ ఉత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్యార్వీ షరీఫ్ వేడుకలకు ఉత్తరప్రదేశ్ నుంచి ముస్లిం మత గురువు సయ్యద్ సాబాత్ హుస్సేన్ సాహెబ్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వేడుకలకు ఏసీపీ కె.లక్ష్మణమూర్తిని ఆహ్వానిస్తూ పత్రిక ఆదివారం అందజేశారు. యాసీన్ మసీదు అధ్యక్షుడు ఖాజీ మొహమ్మద్ అహమదుల్లా ఖాన్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం, దేవరకొండ మార్కండేయులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై పిచ్చి మొక్కలు



పైనాపిల్‌కాలనీ వద్ద పిచ్చి మొక్కలతో నిండిపోయిన ఫుట్‌పాత్



శ్రీకృష్ణాపురం సూర్యనారాయణ స్వామి ఆలయం ముందు ఫుట్‌పాత్‌పై పిచ్చి మొక్కలు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లు పిచ్చి మొక్కలతో మూతపడుతున్నాయి. హనుమంతవాక నుంచి పైనాపిల్‌కాలనీ వరకు ఐదు లైన్లు, పైనాపిల్ కాలనీ నుంచి అడవివరం వరకు మూడు లైన్లు బీఆర్‌టీఎస్ రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు ఇరు పక్కలా పాదచారుల కోసం నాలుగు అడుగుల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఆ ఫుట్‌పాత్‌లు గతంలో పాదచారులకు అనుకూలంగా ఉండేవి. నిర్వహణ లేకపోవడంతో కొంత కాలంగా నడవడానికి వీలులేకుండా పోయాయి. రామకృష్ణాపురం నుంచి పైనాపిల్ కాలనీ వరకు బీఆర్‌టీఎస్‌కు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. పాదచారులు నడవడానికి వీలులేని విధంగా ముళ్ల పొదలు, మొక్కలు మూసేశాయి. పైనాపిల్‌కాలనీ నుంచి సూర్యనారాయణ స్వామి ఆలయం మీదుగా శ్రీకృష్ణాపురం వరకు పాత్‌వేలుపై ముళ్ల పొదలు దట్టంగా అల్లుకున్నాయి. దీంతో ఇక్కడ ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడవలేకపోతున్నారు. ఈ ఫుట్‌పాత్‌లను ఆనుకుని గోడలపై స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అందం, ఆకర్షణ కోసం జీవీఎంసీ వేసిన పెయింటింగ్‌ను కూడా మొక్కలు మూసేశాయి. బీఆర్‌టీఎస్ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటోంది. దీంతో ఉదయం, సాయంత్రం నడక కోసం వెళ్లే వారు ఫుట్‌పాత్‌లను వినియోగించలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఫుట్‌పాత్‌లపై పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించాలని జీవీఎంసీ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపైకి మురుగునీరు



మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో ఆదివారం ఉదయం నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ భూగర్భ డ్రైనేజీలు పొంగి మురుగు నీరంతా రోడ్లపై ప్రవహించింది. దీనిపై స్థానికులు యూజీడీ సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది నాలుగు గంటలపాటు శ్రమించి మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేశారు. తమ ప్రాంతంలో ఎప్పటికప్పుడు ఈ సమస్య పునరావృతం అవుతోందని, ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

బాబోయ్ యూటర్న్



ఆశీలుమెట్ట వద్ద ప్రమాదకరంగా యూటర్న్ మార్గం

- నిత్యం ట్రాఫిక్ జామ్
- ఆశీలుమెట్ట వద్ద నరకం చూస్తున్న ప్రయాణికులు

సీతమ్మధార: ట్రాఫిక్ జామ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు స్టాపర్‌బోర్డులు ఏర్పాటు చేయడమో, దారి మూసేయడమో చేస్తుంటారు. కానీ ఆశీలమెట్టలో ఒక చోట మాత్రం లేని సమస్య సృష్టించి నిత్యం ట్రాఫిక్ జామ్ అయ్యేలా చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఆశీలమెట్ట జీవీఎంసీ జోన్–3 కార్యాలయం ఎదురుగా ఉన్న సబ్‌వే ప్రవేశమార్గంలో గల యూటర్న్ మార్గం వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తుందంటే అతిశయోక్తి కాదు. మూడవ పట్టణం, ద్వారకా స్టేషన్ల సరిహద్దు అయిన ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఆర్టీసీ కాంప్లెక్సు లోపలి మార్గం నుంచి నిత్యం శ్రీకాకుళం, విజయనగరం, టెక్కలి, పార్వతీపురం, బొబ్బిలి, పాలకొండ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే లైన్ బస్సులు రామా టాకీస్ వైపు వెళ్తూ ఈ మార్గం మీదుగా వస్తుంటాయి. అధిక సంఖ్యలో బస్సులు వచ్చే ఈ మార్గంలో సైతం యూ టర్న్ ఉన్న కారణంగా రామాటాకీస్ మీదుగా వచ్చి వెనక్కి వెళ్లేందుకు యూ టర్న్ తీసుకునే సమయంలో వెనుక నుంచి, ముందు నుంచి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోవాల్సి రావడం తీవ్ర దుమారం రేపుతోంది. రామా టాకీస్ నుంచి వచ్చే వాహనాలు సబ్‌వేలో ప్రవేశించేటపుడు తరచూ పలువురు వాహన చోదకులు యూటర్న్ తిరిగే సమయంలో ట్రాఫిక్ ఆగిపోవడం, వాహన చోదకులు హారన్ల మోత మోగించడం ఇక్కడ నిత్యకృత్యం అన్నట్టుగా మారిపోయింది. అలాగే యూ టర్న్ తిరిగే వాహనాలు ఎడమ వైపు తిరిగేటపుడు ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి వచ్చే సిటీ బస్సులు కూడా డెడ్‌స్లో చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా ఇక్కడ ట్రాఫిక్ గస్తీ కూడా లేదు. దీంతో నిత్యం ఇక్కడ నరకం చూడాల్సి వస్తుందని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ యూటర్న్ మార్గం మూసేసి డివైడర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

విశాలాంధ్ర ప్రచురణలతో విజ్ఞానం

సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

మహారాణిపేట: విశాలాంధ్ర ప్రచురణలతో జ్ఞానం.. విజ్ఞానం సముపార్జించుకోవచ్చని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. ఆదివారం టర్నర్ సత్రంలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో పుస్తక ప్రదర్శనను విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. ముందుగా పుస్తక ప్రదర్శనకు విచ్చేసిన రాజుకు నాగేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను వీక్షించారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ మంచి పుస్తకాలు దొరికే చోటు విశాలాంధ్ర అని ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనలతో అందరికీ విజ్ఞానం చేరువవుతుందన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో అనేక పుస్తకాలు ఒకే చోట లభ్యం కావడం అభినందనీయమన్నారు. అంకితభావంతో విశాలాంధ్ర నేటికీ అనేక ప్రాంతాల్లో పుస్తక ప్రదర్శనలు పెట్టి, పుస్తక ప్రియులకు ఎనలేని సేవ చేస్తుందని కొనియాడారు. పుస్తకాలకు ఆదరణ తగ్గలేదని చాటి చెప్పేలా విశాలాంధ్ర చేస్తున్న కృషి మెచ్చదగ్గది అన్నారు. సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావును రాజు అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల పుస్తకాలు ప్రదర్శనగా ఉంచి ప్రజలకు మరింత చేరువ చేయాలని విశాలాంధ్ర కృషి చేస్తుందని తెలిపారు. విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనకు రాష్ట్రంలో ఆదరణ తగ్గలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, అరసం కార్యదర్శి సీఎస్ క్షేత్రపాల్, సభ్యులు బొట్టా అప్పారావు, విశాలాంధ్ర దినపత్రిక విశాఖ ఎడిషన్ మేనేజర్ ససపల నరసింహులు, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పీఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బీచ్‌రోడ్డు : గుర్తు తెలియని వ్యక్తి బీచ్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఇనుప మెట్లుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... ఉదయం వాకింగ్‌కు వచ్చిన వాకర్స్ ఒక వ్యక్తి ఉరి వేసుకుని చనిపోవడాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించటంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించారు. ఆ వ్యక్తి జేబులో మొబైల్ ఉన్నప్పటికీ డేటా మొత్తం డిలెట్ చేసి ఉండడంతో... తన వివరాలు ఎవరికీ తెలియకూడదని అలా చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుని సంబంధీకులు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజలకు రక్షణ

సీతంపేట : రాజ్యాంగాన్ని రక్షించుకున్నప్పుడే ప్రజలను రక్షించుకున్నట్టని పలువురు మేధావులు స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 'భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ప్రజా సంక్షేమం'పై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.హరగోపాల్, దుప్పలపూడి రవికుమార్, డాక్టర్ సుదర్శన్, గూడూరు సీతామహాలక్ష్మి, రత్నకుమారి, వి.వి.రమణమూర్తి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల హక్కుల కోసం, సమాన అవకాశాల కోసం భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించారని తెలిపారు. అగ్ర కులాల చేతుల్లో అధికారం ఉండటం వల్ల రాజ్యాంగంలోని అన్ని అంశాలు అమలు కావడం లేదన్నారు. మతోన్మాదం తీవ్రతరం అవుతోందని, మరోవైపు పరిశ్రమలు ప్రైవేటీకరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర జరుగుతోందని, కాపాడుకోవడానికి బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కేబీఆర్ అంబేడ్కర్, బూసి వెంకటరావు, బర్రె అప్పారావు, చింతాడ సూర్యం, బొడ్డు కల్యాణ రావు, కొత్తపల్లి వెంకటరమణ, పతివాడ రాంబాబు, ఏఎస్సార్ వేమన పాల్గొన్నారు.

పారిశ్రామిక కాలుష్యంతోనే విశాఖకు ముప్పు



పుస్తకం ఆవిష్కరిస్తున్న పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి, తదితరులు

సీతంపేట : పారిశ్రామిక కాలుష్యం విశాఖ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మానవ హక్కుల వేదిక 9వ మహాసభల్లో ఆయన విశాఖలో పర్యావరణ విధ్వంసంపై ప్రసంగించారు. పరిశ్రమల కాలుష్యం, సీవేజ్ వ్యర్థాలు, పోర్టు కాలుష్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలు విశాఖలో కాలుష్యానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. విశాఖ పోర్టు, గంగవరం పోర్టు నుంచి వస్తున్న బొగ్గు, ధూళి చాలా ప్రాంతాలకు విస్తరించి కాలుష్యం బారిన పడేస్తున్నాయన్నారు. పోర్టులో కోల్ డంపింగ్ వద్ద కాలుష్య నివారణ చర్యలు సక్రమంగా తీసుకోకపోవడంతో దుమ్ము, ధూళి వ్యాపిస్తున్నాయన్నారు. కోల్ డింపింగ్స్‌ను కవర్స్‌తో పూర్తిగా కప్పాలని, వాటరింగ్ చేయాలని నేషనల్ ట్రిబ్యునల్ చెప్పినా అమలు చేయడం లేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రమాదకరమైన, అత్యంత ప్రమాదకరమైన జాబితాలో 386 పరిశ్రమలు ఉన్నాయని కాగ్ నివేదికలో పేర్కొన్నట్టు చెప్పారు. గత ఐదేళ్లలో ప్రమాదకర పరిశ్రమలకు పీసీబీ 110 నోటీసులు జారీ చేసిందన్నారు.

కాలుష్యాన్ని గరిష్టంగా వెదజల్లే ప్రభుత్వ రంగంలోని ఎన్‌టీపీసీ, హెచ్‌పీసీఎల్, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఒక్క నోటీసు కూడా జారీ చేయలేదన్నారు. చిన్న పరిశ్రమలపైనే పీసీబీ ప్రతాపం చూపిస్తోందన్నారు. కాలుష్యం కారణంగా అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నా కాలుష్య నియంత్రణాధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శరత్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసేందుకు అన్ని విధాలా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1380 రోజులుగా కార్మికులు, ప్రజా సంఘాలు ఉద్యమిస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షురాలు కె.అనురాధ పారిశ్రామిక కాలుష్యంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

పెదగంట్యాడ: మండలంలోని వికాస్‌నగర్‌లో ఓ వృద్ధురాలి మెడలో పుస్తెలతాడును దొంగ తెంచుకుపోయాడు. న్యూపోర్టు క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్‌లో వుడా ఎంఐజీలోని ఫస్ట్ ఫ్లోర్‌లో శెట్టి రాంబాయి (75) అనే మహిళ ఒంటరిగా నివాసం ఉంటోంది. శనివారం ఆమె మిక్సీ బాగు చేయించుకునేందుకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చింది. ఇంట్లోని వంట గదిలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు తెంచుకుపోయాడు. ఆ సమయంలో ఆమె చేతి వేలికి గాయమైంది. వెంటనే ఆమె న్యూపోర్టు క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

స్పందించిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడి ఫొటోను విడుదల చేశారు. నిందితుని వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ

మురళీనగర్ : క్యాన్సర్ లక్షణాలు ముందుగా గుర్తించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని క్యాన్సర్ వ్యాధుల నిపుణుడు డాక్టర్ వంశీధర్ పుట్రేవు సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్రిందా ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన వైద్య సలహాలు అందించారు. క్యాన్సర్ లక్షణాలకు సంబంధించి ముందస్తు పరీక్షలు చాలా కీలకమని చెప్పారు. సకాలంలో వైద్యం పొందాలన్నారు. క్యాన్సర్ చికిత్స విధానాలను జనరల్ మెడిసిన్ అంకాలజిస్టు డాక్టర్ పి.విజయలక్ష్మి, ఎముకల వ్యాధుల నివారణ మార్గాలను ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ వి.అచ్యుత రమేష్, చలికాలంలో వ్యాధుల వ్యాప్తికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎస్.సంజన వివరించారు. వైద్య శిబిరంలో 193 మంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 63 మందికి గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, కె.ద్వారకానాథ్ పాల్గొన్నారు.